# అభ్యర్థన

శాంతారాం సూరపు

శీతాకాలపు వెన్నెల మంచుతో మసకగా వుంది. వంశధార నదిచుట్టూ పంటచేలు పచ్చగా మంచుతో మచ్చిక చేసుకుని వెన్నెలకు తళతళలాడుతూ తలలాడిస్తున్నాయి.

నది వంతెనపై నడవసాగాను.వెనుక పేపర్ మిల్లులోని సైరన్ మ్రోగింది. చేతిగడియారం వంక చూసుకున్నాను. ఎనిమిది గంటలు రాత్రి. ప్రక్కనుండి నరసన్నపేట – శ్రీకాకుళం షటిల్ సర్వీసు సాగిపోతూ దూరమయ్యింది.

నిశ్శబ్దం... యేటి నీళ్ళు గలగలమంటూ ప్రవహిస్తున్న చప్పుడు. నడుస్తూ తోడు కోసమో.... చలిలో వేడి కోసమో.. సిగరెట్టు వెలిగించాను.

ఆర్నెళ్ళ క్రితం చేరోచేత్తో పొట్ట, ఇంజనీరింగు పట్టా పట్టుకొచ్చి పేపర్ మిల్లులో పెద్ద ఉద్యోగానికే చేరాను. హోదాపరమైన ఇబ్బంది వల్లనేమో...పల్లెలో ఎవరితోనూ నాకు దగ్గర పరిచయాలు ఏర్పడలేదు. మార్నింగ్ వాక్‌తో మొదలయ్యే నా దినచర్య పేపర్ మిల్లులో పని తరువాత ఈవినింగ్ వాక్‌తో ముగుస్తుంది. ఇక రాత్రంతా ఒంటరిగా పల్లెలోని అద్దె గదిలో ఆ నాలుగు గోడల మధ్య నాలో నేనే మాట్లాడుకుంటుంటాను. పల్లెలో కేబుల్ బూచి ప్రవేశించినా ఇంకా నాగదికి ఆహ్వానించలేదు. లేకుంటే కళ్ళు కాబూతల్లా కదిలే బొమ్మల కోసం అటువేపు లాగుండేవి. ఒంటరితనాన్ని దూరం చేసుకుందుకు ఈ మధ్యే వీకెండ్స్ విస్కీతో సెలబ్రేట్ చేసుకోవటం అలవాటు చేసుకున్నాను.

పల్లె దగ్గరయ్యింది. వంతెన దిగి పల్లెవైపు అడుగులేసాను. రోడ్డు ప్రక్కనంతా అరటి తోటలు దయ్యాల మూకలా నిల్చున్నాయి. గాలికి ఆకుల గలగలలు.. చెప్పొద్దూ... కొంచం దడుపు పుట్టిన మాట నిజం...

పల్లెలోనికెళ్ళి నా గదివేపు అడుగులేసాను. గది అనటం కంటే దాన్ని ఇల్లు అనటమే బావుంటుంది. నా కంత అనవసరమే అయినా నాక్కావాల్సిన ఒక్క గది నగరాల్లోలా ఈ పల్లెలో దొరక్కపోవటంతో



అద్దె తక్కువే అవ్వటం వల్ల మొత్తం ఇల్లు తీసుకున్నా నేను పూర్తిగా వాడుతుంది ముందు గది ఒక్కటే.

నేనిచ్చే అద్దె ఆ ఇంటికి చాలా స్వల్పం అని నాకనిపిస్తున్నా కొన్నేళ్ళ క్రిందట ఈ పల్లెలో ఇల్లు అద్దెకిచ్చే మాటే లేదంటుంటాడు శిమ్మన్న. జిల్లాలో గ్రానేట్ రాళ్ళ బిజినెస్ చోటు చేసుకున్న తరువాత ఎక్కడెక్కడినుండో వచ్చి కొండల్ని తవ్వి బండల్ని తరలించే వాళ్ళెక్కువయ్యి అవసరం ముందు నిత్యావసరాల విషయం పట్టక ధరలు పెంచి సామాన్యుడికి బతుకు బరువు చేసారని వాపోతుంటాడు... ఒకప్పటి పల్లెల్లోని మర్యాద మన్నన దానం ధర్మం నశించి వ్యాపార మర్మమేం పుట్టుకొచ్చిందంటాడు. నాకది నిజమే అనిపించినా నేనుంటున్న ఇంటి విష యానికొస్తే అది పూర్తిగా నిజం కాదనిపిస్తుంది. పెద్ద బంగళా అంత ఇంట్లో కేవలం ఒక్క ముసలతను వుంటాడు. ముందు నా దగ్గర అద్దె తీసుకోటానికి అతడు ఒప్పుకోలేదు. ఉత్త పుణ్యానికి వుండటం ఇష్టం లేక పెట్టేబేడా సర్దుకోబోతే చాలా కష్టంగా కిరాయి నిర్ణయించాడు.

అంతలోనే నా ఆలోచన మరోవేపు మళ్ళింది. ఆ ఇంట్లో ప్రవేశించిన నాటి నుండి నేనో విషయం గమనిస్తున్నాను. ఎదుటి వాటా కిటికీ లోంచి రెండు కళ్ళు రోజూ నన్ను పలకరిస్తుంటాయి. అవి కచ్చితంగా ఆ ముసలతనివి కాదు. నా ఊహ ప్రకారం ఒక అందమైన అమ్మాయివి. 'అందమైన' అని ఎందుకంటున్నానంటే... ప్రపంచంలోని అమాయకత్వాన్నంతటినీ పొందుపరచుకొని లే ఎండలో మంచు నీటి ముత్యపు తళతళలతో మెరుస్తూ ఆకాశమంత స్వచ్ఛతను అద్దుకున్న భావ ప్రకటనతో మిళితమైన ఆ కళ్ళు,రోజూ నన్ను పలకరిస్తున్నట్టుగా నవ్వే భావంలోని 'అందం' నన్నలా ఊహించుకునేట్టుగా చేస్తుంది. కాని, ఆ ఇంట్లో మరో మనిషి వున్న అలికిడి లేదు. 'మరి ఆ కళ్ళు...?'

ఎవరినైనా అడుగుదామనుకుంటే వాళ్ళేం తప్పుగా అర్ధం చేసుకుంటారో అని భయం. నేనే తెలుసుకోబోయి ముసలతని కోసం ఓసారి ఆ వాటాలోనికి వెళ్ళాను. ఆయన ఎక్స్‌సర్వీస్‌మేన్... సాదరంగా నాన్నాహ్వానించి టీ అతడే కాచిచ్చి మర్యాద చేసాడు. ఆ విజిట్‌లో కూడా నా ఫజిల్ వీడలేదు. నాకు మరో మనిషి కనిపించలేదు.

ఆలోచిస్తూ ఇల్లు చేరుకునే సరికి నా కోసమే ఎదురు చూస్తూ కనిపించాడు శిమ్మన్న. జంక్షన్ దగ్గర హోటల్ నుండి కారియార్ తెచ్చినట్టున్నాడు. వాడిని పంపించి నా వాటా తాళం తియ్యబోతూ అలవాటుగా ఎదుటి వాటా వైపు చూసాను. వీధి దీపపు కాంతిలో ఆ వాటాలోని కిటికీలోంచి ఆ కళ్ళు పలకరించాయి. దృష్టి మరల్చి తాళం తియ్యబోతుంటే కరెంటు పోయింది.

తలుపు తీసి క్రొవ్వొత్తి వెతుక్కుని వెలిగించాను. ఎందుకో ఈ మసక రాత్రి మనసు మధువు మీదికి పోయింది. పక్కమీద కూర్చుని బాటిల్ ఓపెన్ చేసాను. కిటికీ లోంచి బయటికి చూస్తూ విస్కీ కొద్దికొద్దిగా సిప్‌చేయసాగాను.

రెండో పెగ్ పూర్తి చేసేసరికి నాలో లిక్కర్ ప్రభావం కొద్దిగా మొదలయ్యింది. మూడో పెగ్ ఫిక్స్ చేసుకుంటూ ఆలోచించాను. మామూలు స్థితిలో మనకెందుకులే అనుకున్నా ఈ స్థితిలో ఆ కళ్ళ విషయం మిష్టరీలా అనిపించసాగింది. అంతలో బయట తలుపు చప్పుడయ్యింది. భృకుటి ముడిచాను. ఇదివరకు ఎప్పుడూ నా తలుపు తట్టి వచ్చిందెవ్వరూ లేదు. ఆలోచిస్తూనే వెళ్ళి తలుపు తీసాను.

బయట ఎవరూ లేరు.

గేటు వరకూ వెళ్ళి చూసాను.

చల్లటి గాలి తెమ్మెర నా ముఖాన్ని తేమగా స్పృశించి పోయింది. వర్షం వచ్చే సూచన తెలిసింది. బహుశ తలుపు గాలికి కదిలి వుండొచ్చని సమాధానం చెప్పుకుంటూ వెనుతిరగబో





## చాక్‌లెట్ నటాషా

బాలీవుడ్ తెరపై కొత్తగా కనిపిస్తున్న నటాషాకి చాక్‌లెట్లతో పాటు, హీరో షారూఖ్‌ఖాన్ అంటే చాలా ఇష్టం. సినిమాలు చూడడం, నటించడమంటే ఇంకా ఇష్టం. టైం వేస్ట్ చసేవాళ్లంటే చాలా కోపం. హాయిగా నిద్రపోవడం, కారులో తిరగడం ఈ అమ్మాయి హాబీలు. పెద విపై వున్న పుట్టుమచ్చ తన సెక్సీస్పాట్ అని చెప్పే నటాషాకి సెట్స్‌పై గంటల తరబడి వేచి వుండడం చాలా చిరాకట! కాస్త పేరు వస్తే అందరూ షూటింగ్ లకి లేట్‌గానే వస్తారు – ఈ విషయం తెలియదా నటాషా!

తుంటే నా ప్రక్కనుండి ఎవరో పరుగెత్తుకు పోతున్నట్టు మెత్తనైన అడుగుల చప్పుడు.

ఆకాశం మేఘావృతం అయ్యి వుందేమో... ఇందాకటి వెన్నెల కూడా లేదు. నాకెవరూ కనిపించలేదు. వీధి చివర సూడి కుక్క వుండివుండి మొరుగుతోంది. ఎదురు వాటా మేజరుగారి గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. మిస్టరీ అర్థం కాక జేబు లోంచి సిగరెట్టు తీసి వెలిగించుకో బోయాను.

ఆకాశంలో మెరుపు మెరిసింది..

ఆ మెరుపు వెలుగులో ఎదుటి వాటా కిటికీ దగ్గర రెండు కళ్ళు మిలమిలలాడాయి. ఆ కళ్ళల్లో ఏదో భావం వుంది. ఆ లిప్తపాటు సమయంలో నాకదేమిటో అర్థం కాలేదు. చీకట్లో అటువేపే చూస్తూ సిగరెట్టు పొగ పీల్చసాగాను.

ఆకాశం మళ్లీ మెరిసింది. ఈసారి కాసేపు ఎక్కువ ఆ కళ్ళలోని భావం స్పష్టంగా తెలిసింది. ఆ కళ్ళు నావైపు అభ్యర్థనగా చూస్తున్నాయి.

'ఎందుకోసం...?' నా చుట్టూ ఆలోచనలు ముసురుకున్నాయి.

ఆ అమ్మాయికి నా నుండి ఏదైనా సహాయం కావాలేమో... అయితే ఆ సహాయం ఎటువంటిది...? ఎటువంటిదైనా చెయ్యటానికి సిద్ధపడేలా ఆ కళ్ళు నన్ను ఎప్పుడో మెస్మరైజ్ చేసేసాయి.

చినుకులు మొదలవ్వటంతో నా గదివైపు నడిచాను.

గదిలోనికి వెళ్ళి పక్క మీద కూర్చుని విస్కీ గ్లాసు కోసం చూసి షాక్ తిన్నాను. కిటికీపై పెట్టిన విస్కీ సీసా లేదు. గ్లాసులో ఫిక్స్ చేసుకున్న పెగ్‌లో కిటికీపై పెట్టిన సిగరెట్టు పెట్టె నానుతోంది. ప్రక్కనున్న క్రొవ్వొత్తికి విస్కీ వాసన తగిలిందేమో... మంట అటు ఎగ్రబాకింది.

ఆర్పాలన్న ధ్యాస కూడా లేనట్టు చేష్టలుడిగి మండుతున్న సిగరెట్టు పెట్టె వేపు చూస్తూ వుండిపోయాను. మంటవేడికి విస్కీ గ్లాసు చిట్లింది. బయట మెరుపు మెరిసింది. ఎదుటివాటా కిటికీలోంచి ఆ కళ్ళు మంటవేపు నా వేపు భయంగా చూస్తున్నాయి.

కాసేపటికి ఎర్రటి బూడిదను గ్లాసులో చూపుతూగదిలో చీకటి అలముకుంది. ఈ క్రొత్త మిస్టరీ అర్థంకాక నిశ్చేష్టంగా చాలా సేపు వుండిపోయాను. వర్షం ఉధృతమయ్యింది... ఎక్కడో పిడుగు పడింది.

రాత్రి పన్నెండయినా నిద్ర పట్టక బెడ్‌పై అటు ఇటు దొర్లసాగాను. అంతకంతకు వర్షం ఎక్కువ అవుతుంది. ఆ వాతావరణం చూసి మనసు కీడు శంకించింది. తల నిండా కంబళి ముసుగు కప్పాను.

★★★

తెల్లారి ఆదివారం... ఆలస్యంగా లేచాను. కిటికీ తెరచి బయటకు చూసి గాబరాపడ్డాను. ఎదుటి వాటా గుమ్మం ముందు గుంపు. వర్షం కురుస్తూనే వుంది. తుఫాను అనుకుంటాను. ఆ వర్షాన్ని లెక్క చెయ్యకుండా అంత మంది జనం.

ఇంట్లోంచి బయటపడి జనాల్లోంచి చొచ్చుకెళ్ళి చూసాను.

వరండాలో నేలమీద హాయిగా నిద్ర పోతున్నట్టున్న పదునాలుగేళ్ళ పాప... తల మీదుగా దీపం వెలుగు తుంది. ఆ అట్మాస్ఫియర్ చూస్తూనే నా కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

ఎవరూ ఏడుస్తున్న అలికిడి లేకపోవటంతో ఆ పాప ఎవరి తాలుకు అర్థం కాలేదు. ఆ ఇంటి ముసలాయన కోసం చూసాను. ఓ ప్రక్క కూలబడి వున్నాడు.

పాప చేతుల మధ్య ఏదో వుండటం చూసి చొరవ చేసి తీసాను. ఆశ్చర్యం... అది నా ఫోటో... కాదుకాదు... అందులోని మనిషి దగ్గర నా పోలికల్లో వున్నాడు.

'పాపం... మేజరుగారి అబ్బాయి... పిల్ల తండ్రి. పెళ్ళాం పోయి ఒంటరిగాడై వున్న సిగరెట్టుకి తోడు బుడ్డీ కూడా జతకట్టి పోయినేడాదే పోయినాడు. తల్లి లేని పిల్ల తండ్రి నొక్క క్షణం ఒదిలుండేది గాదేమో... అతగాడొదిలిన సిగరెట్టు పొగపీల్చిపీల్చి పిల్ల కేన్సర్ బారిన పడింది... కొడుక్కూడా పోయినాక ఒంటరిదై పోయిన మనవరాలిని మేజర్ కూడా తెచ్చుకున్నాడు. తండ్రి మీదే దేస పెట్టుకుందో ఏమో... పిల్ల ఒక్కనాడూ బయటకు కనిపించింది లేదు. దేముడు పసోల్లని, ప్రేమమూర్తుల్ని దగ్గిరికి పిల్చుకుంటాడేమో... ' నా చేతిలోని ఫోటోచూసి ప్రక్కనున్న వ్యక్తి అన్న మాటలు నాకు కొంతవరకు అర్థమయ్యాయి. నన్ను చూసినప్పుడల్లా మేజర్ చూపుల్లో ఆత్మీయత గుర్తుకొచ్చింది. జీర నిండినకళ్ళతో మూసివున్న ఆ చిన్నిపాప కళ్ళవైపే చూస్తూ వుండిపోయాను...

'ఆకాశమంత స్వచ్ఛతను అద్దుకుని నన్ను పలకరించే ఆ కళ్ళు ఏవి...?' గుండె బరువెక్కు తుండగా అక్కడి నుండి కదిలాను.

జనాల్లోంచి బయటకొచ్చాక నా కళ్ళు ఓ చోట నిలిచిపోయాయి.

రోజు నన్ను పలకరిస్తున్నట్టు చూసే ఆ కళ్ళు కనిపించే కిటికీ బయట నేలపై ముక్కలుగా పగిలివున్న నా విస్కీ సీసా... అది చూసి గుండె ముక్కలవుతుండగా నాకు జ్ఞానోదయం అయ్యింది.

ఆ చిన్నిపాప కళ్ళలోని 'అభ్యర్థన' అర్థమయ్యింది. జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి వర్షపు నీటిలో వదిలేసాను. ★